లక్ష్యాలకు అనుగుణంగా రీ-సర్వే నిర్వహించాలి

పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో క్షేత్రస్థాయి పర్యటించిన కలెక్టర్

విజయనగరం - పూసపాటిరేగ, డెంకాడ : నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, జూలై ఆఖరు నాటికి రెండో దశ పనులను పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ పేర్కొన్నారు. తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో సంబంధిత డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో పొందుపరచాలని చెప్పారు. సాంకేతిక సమస్యలను అధిగమించి నిర్ణీత గడువులోగా రెండో దశ రీ-సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో జరుగుతున్న రీ-సర్వే ప్రక్రియను మంగళవారం ఆమె స్వయంగా పరిశీలించారు. ముందుగా డెంకాడ మండలం మోపాడ గ్రామంలో ఆధునిక పరికరాల సాయంతో చేపడుతున్న రీ-సర్వేను పరిశీలించారు. రోవర్లు ఇతర సాంకేతిక పరికరాల వినియోగం గురించి ఆరా తీశారు. మోపాడలో సంబంధిత రైతులతో కాసేపు మాట్లాడారు. వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పర్యటన తర్వాత డెంకాడ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్న ఆమె ఆన్‌లైన్లో వివరాల నమోదు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. వివిధ లాగిన్ల పనితీరును పరిశీలించారు. విలేజ్ సర్వేయర్, వీఆర్వో, తహశీల్దార్ల లాగిన్లలో పెండింగ్ ఉన్న దశలను సరి చూశారు. డెంకాడలో రెండో దశలో భాగంగా 20 గ్రామాల్లో సర్వే జరుగుతుండగా ఆయా గ్రామాల్లో తాజా పరిస్థితిని లాగిన్ ప్రక్రియ ద్వారా కలెక్టర్ పరిశీలించారు. జీలైన్, ఎఫ్‌లైన్ల సాయంతో రూపొందించిన మ్యాప్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె పూసపాటిరేగ మండలంలో పర్యటించారు. రీ-సర్వే పూర్తి చేసుకున్న గ్రామాల్లో రైతుల పాసు పుస్తకాలకు ఆధార్ అనుసంధానం చేయాలని సూచించారు. అలాగే ఎల్.పి.ఎం. నంబర్ ఆధారంగా మ్యుటేషన్ ప్రక్రియను నిర్వహించాలని పేర్కొన్నారు. ఒక్కొక్క గ్రామంలో కనీసం మూడేసి చొప్పున ఎల్.పి.ఎం. ఆధారంగా మ్యుటేషన్లు చేయాలని కలెక్టర్ నిర్దేశించారు. ఆటో అప్‌డేషన్ అయ్యేలా చర్యలు తీసుకొని దానికి అనుగుణంగా వివరాలు పొందుపరచాలని సూచించారు. పర్యటనలో ఆమెతో పాటు విజయనగరం ఆర్డీవో సూర్యకళ, సర్వే విభాగపు ఏడీ త్రివిక్రమరావు, పూసపాటిరేగ, డెంకాడ తహశీల్దార్లు భాస్కర్‌రావు, ఆదిలక్ష్మి, ఆయా మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

చిరుప్రాయంలోనే పురస్కారాలు గర్వకారణం

నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : పదో తరగతిలోనే విద్యార్థులు సత్కారం పొందడం గొప్ప ప్రశంసని, వారి తల్లి దండ్రులకు గర్వకారణం అని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఈ స్థాయికి చేరుకోవడానికి ఎంతో కష్టపడ్డారని, ఇదే స్ఫూర్తిని ముమ్ముందూ కొనసాగించి ఇష్టమైన రంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో పది, ఇంటర్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన జిల్లాలోని ఆర్యవైశ్య విద్యార్థులకు మంగళవారం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె.. ముందుగా వాసవీమాత చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిభ చూపుతున్న ఆర్యవైశ్య బిడ్డలను గుర్తించి, ప్రోత్సహించిన అవోపాకు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రుల కష్టాన్ని మర్చిపోవద్దని సూచించారు. భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదిగి నలుగురికి ఉపాధి కల్పించేలా, అందరికీ మంచి చేసేలా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఒడి, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్మెంట్ వంటి పథకాల అమలుతోపాటు.. విద్యాకానుకల పేరిట స్కూల్ బుక్స్, స్టడీ మెటీరియల్స్, బ్యాగ్, షూ అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహించడం చాలా గొప్ప విషయమన్నారు. అవోపా గతంలో ఆరోగ్య శిబిరాలు, వధూవరుల పరిచయ వేదికలు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేయడం.. అందరికీ ఆదర్శంగా నిలవడం చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో అతిథులుగా బండారు బంగార్రాజు, ఎం.వి.వి సత్యనారాయణ, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ సెక్రటరీ రవ్వా శ్రీనివాస్ మాట్లాడారు. అవోపా అధ్య క్షుడు బండారు చంద్రశేఖర్, కార్యదర్శి తవ్వా మోహనరావు, కోశాధికారి ముమ్మిడిశెట్టి సత్యనారాయణ పర్యవేక్షణలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర - విజయనగరం : జిల్లాలోని సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వ శాఖలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ (డిసిడిసి) తొలి సమావేశం మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సహకార సంఘాల కార్యకలాపాలను విస్తృతం చేసి, వాటి ఆదాయం పెంచేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కొన్ని సంఘాల కార్యకలాపాలు నామమాత్రంగా ఉన్నాయని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక సౌకర్యాలను వినియోగించుకొని వాటి పరిధి పెంచాలని సూచించారు. ఆయా సంఘాల దృక్పథంలో మార్పును తీసుకువచ్చి, ఇతర రంగాలవైపు అడుగుపెట్టేలా నడిపించాలని కోరారు. ముఖ్యంగా సేవా రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో ఏర్పాటైన సహకార సంఘాల కార్యకలాపాలపై ఆరా తీశారు. ఆయా సంఘాలను బలోపేతం చేయడానికి, నెలరోజుల్లో తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా సహకార అధికారి వి.రమేష్ మాట్లాడుతూ, దేశంలో సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు 2021లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సహకార శాఖను ఏర్పాటు చేసిందన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రకాల సహకార సంఘాలు సుమారుగా 5 లక్షలు వరకు ఉన్నాయని, వీటన్నిటి వివరాలను ఎన్‌సిడిబిలో పొందుపరచమని ప్రభుత్వం ఆదేశించిందని వివరించారు. దీనిలో భాగంగా తొలివిడతగా పిఏసిఎస్‌లు, మత్స్య, డెయిరీ రంగంలోని సహకార సంఘాలను ఆన్‌లైన్లో నమోదు చేయడం పూర్తి అయ్యిందని, మిగిలిన వాటిని కూడా త్వరలో ఆన్‌లైన్ చేస్తామని చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం ఏపి కోపరేటివ్ సొసైటీ చట్టం-1964 ప్రకారం నమోదైన సంఘాలు 454, ఏపి ఎంఏసిఎస్ యాక్ట్-1995 ప్రకారం నమోదైన సంఘాలు 1784 ఉన్నాయని తెలిపారు. వివిధ సహకార సంఘాలు, వాటి కార్యకలాపాలు, ప్రస్తుత వాటి స్థితిగతులను రమేష్ వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిసిసిబి సిఇఓ జనార్దన, డిపిఓ శ్రీధర్ రాజా, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, పశు సంవర్థకశాఖ జెడి విశ్వేశ్వర్రావు, మత్స్యశాఖ డిడి నిర్మలా కుమారి, ఐసిడిఎస్ పిడి శాంతకుమారి, పంచాయితీరాజ్ ఎస్ఇ బిఎస్ఆర్ గుప్త, మత్స్యకార ఫెడరేషన్ ప్రతినిధి బర్రి చిన్నప్పన్న, నాబార్డ్ డిడిఎం నాగార్జున, పరిశ్రమలశాఖ డిడి నాగేశ్వర్రావు, ఎక్సైజ్ సూపరింటిండెంట్ వి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద కుష్టు కేసులను గుర్తించండి

డిప్యూటీ డిఎంహెచ్ సూర్యనారాయణ

విశాలాంధ్ర - జామి : కుష్టు వ్యాధి పట్ల క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి అనుమానస్పదంగా ఉన్న కుష్టు కేసులను వెంటనే గుర్తించాలని డిప్యూటీ డిఎంహెచ్‌ఓ ఎస్.సూర్యనారాయణ సూచించారు. స్థానిక జామి పిహెచ్సిలో మంగళవారం ఆయన ఆశాలు, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్పిలతో కుష్టు వ్యాధికి సంబంధించిన సర్వే పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 26 నుంచి వచ్చే నెల 16 వరకు ఎల్సిడిసి సర్వేను నిర్వహించాలన్నారు. శరీరంలోని పలు భాగాలపై స్పర్శ లేకపోయినా, నొప్పిలేని బొడిపెలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. అంగవైకల్యం రాకుండా ఎండిటి చికిత్సర ద్వారా కుష్టు వ్యాధిని నివారించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారులు డాక్టర్ ఎస్. భాగ్యరేఖ, డాక్టర్ వనజ, డిహెచ్ఎన్ఓ మామిడి సత్యవతి, పీహెచ్సీ హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్ ప్రేమ్ కుమార్, సిహెచ్ఓ ఫ్లొరెన్స్ సూపర్వైజర్లు భవాని, సత్యనారాయణ పాల్గొన్నారు.

యోగా ద్వారా మానసిక ఆరోగ్యం

విశాలాంధ్ర - చీపురుపల్లి : 9వ అంతర్జాతీయ యోగా వారోత్సవాలో భాగంగాలిమహిళలకు యోగా పై అవగాహన సదస్సు చీపురుపల్లి ఆశయ యూత్ అసోషియేషన్ మరియు చైతన్య యోగా శిక్షణ కేంద్రం ఆవరణలో ఈ కార్యక్రమంలో చైతన్య మహిళా యోగా కేంద్రం నిపుణులు శ్రీమతి గవిడి సుజాత పర్యవేక్షణ లో ప్రతి రోజు యోగా శిక్షణ కేంద్రం జరుగుతుంది అమె మాట్లాడుతూ యోగా భారతదేశం సంపదని అలాటిది ఈ రోజు ప్రపంచ దేశంలో జరుగుతుంది ని ప్రజలు అందరూ యోగా చేసి అరోగ్యంగా వుండలని అలాగే ప్రతి కుటుంబ సభ్యులు ప్రజలు యోగా అసనాలు నేర్చుకోవలని దేశం లో యోగా నేర్చుకోని అనేక మంది రోగాలు దూరంగా. వున్నారని అని అన్నారు. ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ మాట్లాడుతూ యోగాఅనేది 5000 సంవత్సరాల నుండి భారతదేశంలో ఉన్న జ్ఞానము యొక్క అంతర్భాగము చాలా మంది యోగా అంటే శారీరక వ్యాయామము, కేవలం కొన్నిశారీరిక కదలికలు (ఆసనాలు) ఇంకా శ్వాస ప్రక్రియ అని మాత్రమే అనుకుంటారు. కానీ నిజానికి మానవుని యొక్క అనంతమైన మేధాశక్తి, ఆత్మశక్తిల కలయిక.యోగా అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశయ సంస్థ సభ్యులు కె.సాయి, కె.హేమంత్ మహిళాలు పాల్గొన్నారు.

పేదల కడుపులపై కొట్టిన పాపం..ఊరకే పోదు

విశాలాంధ్ర - బొబ్బిలి : స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం గోడకు ఆనుకొని సుమారు 30 సంవత్సరాలుగా చిరు వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్న సుమారు 25 మంది కుటుంబాలకు చెందిన పేదల బడ్డీలను మున్సిపల్ అధికారులు జెసిబితో తొలగించి, సామాన్లను చిందర వందర చేయడం దుర్మార్గమైన చర్యలని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బేబీనాయన మున్సిపల్ అధికారులు, అధికార పార్టీ నాయకుల తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం రాజా ప్యాలెస్‌లో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బేబీనాయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిటిడి కళ్యాణ మండపం వద్ద వైయస్సార్ కాంగ్రెసు పార్టీ సానుభూతిపరుడుపై కక్షతో 25 మంది నిరుపేద కుటుంబాలను రోడ్డుపాలు చేయడం ఎంత వరకు సబబని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రశ్నించారు. టిటిడి కళ్యాణ మండపంలో అన్ని వసతులు కూడా ఉన్నాయని కార్ పార్కింగ్‌కి వంట చేయడానికి భోజనాలు చేయడానికి వేరువేరుగా స్థలాలు ఉన్నాయని టీటీడీ వద్ద ట్రాఫిక్ సమస్య లేదని మరుగు కాలువకు మీరు వెళ్లడం లేదు అని చెప్పి పేదల కడుపు కొట్టడం ఎంతవరకు న్యాయమని సంబంధిత మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు.? మరలా ఆ షాపులు అక్కడ పెట్టేవరకు తాను పోరాటం చేస్తానని సవాలు విసిరారు. తక్షణమే మున్సిపల్ అధికారులు అధికారి పార్టీ నాయకులు టీటీడీ కల్యాణ మండపం వద్ద తొలగించిన షాపులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కాలువ తీయడానికి సహకరించాలి : మండల అధికారులు

విశాలాంధ్ర - భోగాపురం : ముంజేరు గ్రామంలో సిద్దార్ధ కాలనీలో నుంచి కాలువను తీయడానికి కాలనీ వాసులు ఒప్పుకోక పోవడంతో మండల అధికారులు వెనుతిరగాల్సివచ్చింది. గత కొన్ని నెలలుగా ముంజేరు గ్రామస్తులకు సిద్దార్ధ కాలనీ వాసు లకు కాలువ విషయంలో గొడవలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఐతే మంగళవారం మండల అధికారులు, సిఐ విజయనాథ్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తుతో సిద్దార్ధనగర్ కాలనీలో కాలువ తీయడానికి జెసిబితో ప్రయత్నించగా కాలనీ మహిళలు కాలువలో నిల్చొని అడ్డుకున్నారు. మొత్తం అధికార యంత్రంగా నచ్చచెప్పే ప్రయత్నం చేసిన వారు వినలేదు. కాలనీలో నుంచి కాలువ తీయడానికి ఒప్పుకోమని వాగ్వివాదానికి దిగారు. మండల అధికారులు చర్చించుకొన్న అనంతరం ఎంపిడీఓ అప్పలనాయుడు కాలనీ వాసులను వారిస్తూ ప్రస్తుతం కాలువ తీయడం లేదని రెండు రోజుల తర్వాత వస్తామని ఈ లోగా ఆలోచించుకోవాలని తెలిపి కాలువ తీత పనులు వాయిదా వేశారు. అధికారులు ఎప్పుడు వచ్చిన కాలువ తీయడానికి ఒప్పుకునేది లేదని కాలనీ వాసులు తెగేసి చెపుతున్నారు. అయితే ఈ సమస్య జిల్లా లో అత్యంత చర్చనీయంశంగా మారింది. ఈ సమస్యను జటిలం కాకుండా అధికారులు ఎలా పరిష్కరిస్తారో అని అందరు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

సీతం విద్యార్థినికి ముఖ్యమంత్రి చేతుల మీదగా అవార్డు ప్రదానం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ నాలుగో సంవత్సరం చదువుతున్న అన్నా నేహా థామస్ అనే విద్యార్థిని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇవ్వ బడుతున్న ఇన్ఫ్లెన్షియల్ స్టూడెంట్ అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డును ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఆమె విజయవాడలో సోమవారం నాడు అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి శ్రీ బొత్స సత్యనారాయణ మరియు ఇతర మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ అన్నా నాహా థామస్ చదువుతోపాటు శాస్త్రీయ నృత్యంలోను, అలాగే ఎన్. సి.సి.విభాగంలో ప్రతిభ కలదని, అలాగే ఈ సంవత్సరం జనవరి 26న రిపబ్లిక్ డే ఢిల్లీ ఎన్.సి.సి. పెరేడ్‌లో ఆమె పాల్గొందని, విద్యార్థులంతా ఆమెను ఆదర్శంగా తీసుకొని అన్ని రంగాల్లో వృద్ధి చెందాలని ఆమె కోరారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు అన్నా నేహ థామస్‌కు మరియు అవార్డులు అందుకున్న వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

రాయితీపై రైతులకు విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - గుర్ల : మండల కేంద్రంలో గుర్ల రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు రాయితీపై వరి విత్తనాలు ఎంపీపీ ప్రతినిధి పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించి నిరంతరం రైతు శ్రేయస్సు కొరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో %ణూణాా% చైర్మన్ బంగారునాయుడు గారు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు మధుసూదన్ రావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ముద్దాడ కేశవరావు, స్థానిక సర్పంచ్ ప్రసాద్ గారు, ఎంపిటిసి సీతారాం మండల వ్యవసాయ శాఖ అధికారి తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యులు బి. జోగునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమంపై సిద్ధం కావాలి : కలెక్టర్ నిషాంత్ కుమార్

విశాలాంధ్ర - పార్వతీపురం : జగనన్న సురక్ష కార్యక్రమం అమలుకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరు కార్యాలయం నుండి మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిపిన సమీక్షా సమావేశంలో జగనన్న సురక్ష, గృహనిర్మాణం, ప్రాధాన్యత భవనాల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఈ నెల 23న ముఖ్య మంత్రి జగనన్న సురక్ష కార్యక్రామాన్ని రాష్ట్ర స్థాయిలో ప్రారంభం చేస్తారని, జిల్లాలో 24 నుండి ప్రారంభించడం జరుగుతుందన్నారు. అందు కుగాను సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ప్రతిఇంటికి వెళ్లి ప్రజలకుగల అవసరాలను ముందుగా తెలుసుకొని, సమస్యలను యాప్ నందు అప్లోడ్ చేయాలన్నారు. మండలటీం వచ్చే సమయానికి సర్టిఫికెట్లు పంపిణీ, ఇతర సమస్యల పరిష్కారానికి ముందస్తుగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈప్రక్రియపై సచివాలయ సిబ్బందికి, వాలం టర్లకు ముందస్తుగా అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జిల్లాలో పట్టణ ప్రాంతంలో 27 వేల 142 ఇళ్లు మంజూరు కాగా అందులో ఇంకా 4100 గ్రౌండింగు కాలేదని, వారంరోజులలో గ్రౌడింగు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతంలో 7వేల306 మంజూరుగా ఇంకా 1600 ఇళ్లు గ్రౌండింగు చేయాలని, వాటిని గ్రౌండింగు చేసి నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని కలెక్టరు ఆదేశించారు. జిల్లాలో నిర్మాణంలో గల ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు సెప్టెంబరు 15వ తేదీ నాటికి పూర్తిచేయాలన్నారు. జాయింటు కలెక్టరు ఆర్. గోవిందరావు మాట్లాడుతూ కౌలు రైతులకు కౌలుసాగు కార్డులు జిల్లాకు 5125 లక్ష్యం నిర్ణయించారని, లక్ష్యానికి మించి కౌలురైతులకు కార్డులు పంపిణీకి చర్యలు తీసుకో వాలన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాలలో ఈనెల 25 నాటికి సచి వాలయం పరిధిలోగల గ్రామాలలో కనీసంఒకటి చొప్పున రిజిస్ట్రేషన్లు జరిగేటట్లు చూడాలన్నారు. డిసిసిబి బ్యాంకు లావాదేవీల రిజస్ట్రేషన్లుకూడా గ్రామాలలో చేయుటకు చర్యలు తీసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకటరావు, జిల్లా పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కృష్ణాజీ, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ప్రభాకరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె. రాజకుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

డైట్ సెట్ లో వాసవి కాలేజీ విద్యార్థికి రాష్ట్ర ఫస్ట్ ర్యాంక్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : ప్రభుత్వం విడుదల చేసిన ఏపీ డిఈఈసిఈటి (డైట్ సెట్) ఫలితాల్లో పార్వతీపురం పట్టణంలోని వాసవి కళాశాల విద్యార్థినికి స్టేట్ ఫస్ట్ ర్యాంకు వచ్చి నట్లు కరస్పాండెంట్ పీవీకే మణికుమార్ తెలిపారు. తమ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ చదివిన అద్దంకి శ్రీ చందన అనే విద్యార్థినికి ఫిజికల్ సైన్స్ ఆప్షనల్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు వచ్చిందన్నారు. స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన విద్యార్థిని శ్రీ చందన కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు ఏ.వేణుగోపాల్ మహాలక్ష్మి తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా మణికుమార్ మాట్లాడుతూ తమ కళాశా లలో చదువుకున్న విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో పాటు వివిధ పోటీ పరీక్షల్లో కూడా చక్కని ఫలితాలు సాధిస్తున్నారన్నారు.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాలాంధ్ర - సీతానగరం : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని లయన్స్ కళ్యాణ మండపంలో నిర్వహించడం జరుగుతుందని బూర్జ ఆయుర్వేద వైద్యులు తెర్లి హేమాక్షి తెలిపారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తోపాటు జిల్లాల్లోని అందరు అధికారులు, ప్రజా ప్రతినిధులు,వివిధ మండలాల ఆయుష్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. యోగా కార్యక్రమంలో అంతాస్వచ్ఛందంగా పాల్గొని విజయవంతంచేయాలని కోరారు. ఉదయం 6గంటలకు యోగా కార్యక్రమం ప్రారంభం అవుతుందని, యోగాద్వారా మానసిక, శారీరక ప్రశాంతత, ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తుందని చెప్పారు.

ఓటరు పరిశీలన, హౌసింగ్ మ్యాప్ పై శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర - సీతానగరం : గ్రామాల్లోని ఓటరు జాబితాల పరిశీలన, హౌసింగ్ మ్యాప్ పై టీడీపీ నాయకులు ప్రత్యేకశ్రద్ధ తీసుకొని పనిచేయాలని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పిలుపు నిచ్చారు.మంగళ వారం సీతానగరం మండల బూతు ఇంచార్జిలకు, గ్రామపార్టీ అధ్యక్షులకు ఓటర్ల జాబితా పరిశీలన, హౌసింగ్ మ్యాప్ పై శిక్షణకార్యక్రమంను జోగమ్మపేట గ్రామంలో నిర్వహించారు. రాష్ట్ర పార్టీ అదేశాలు మేరకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ద్వారా పలుఅంశాలను వివరించి రానున్న సాధారణ ఎన్నికలలో టీడీపీ క్యాడర్,నాయకులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు కొల్లి తిరుపతి రావు గారు, సెక్రటరీ రౌతు వేణుగోపాలనాయుడు, గొట్టాపు వెంకట నాయుడు, క్లస్టర్ ఇంచార్జి బొమ్మినాయుని లక్ష్మణరావు, అరకు పార్లమెంటు కార్యదర్శి టంకల శ్రీనివాసరావు, బూత్ ఇంఛార్జి బొమ్మినాయుని శ్రీనివాసరావు, సాల హరిగోపాల్, బుడితి శ్రీనివాసరావు, సబ్బాన శ్రీనివాసరావు , ఉడమల సూర్యనారాయణ, గుంపస్వామి, వెంకటనాయుడు, యోగేశ్వరరావు,సింహాచలం, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు అవకాశాలు అందిపుచ్చుకోవాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : నిరుద్యోగులు అవకాశాలు అందిపుచ్చుకోవాలని, యుక్త వయస్సులోనే ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యా భివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పార్వతీపురంలో శ్రీ వేంకటేశ్వర గవ్నమెంట్ డిగ్రీ కాలేజీ ఆవరణంలో వై.ఎస్.కె ఇన్ఫో టెక్, వారాహ కంపెనీలతో మినీ జాబ్ మేళను మంగళ వారం నిర్వహించారు.జాబు డ్రైవ్ కు సుమారు 103 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 37 మంది వై.ఎస్.కె ఇన్ఫో టెక్, వారాహ కంపెనీలలో ఎంపికయ్యారు.ఈ సందర్భంగా అభ్యర్థులకు నిర్వహించిన అవగాహన కార్య క్రమంలో శ్రీ వేంకటేశ్వర గవ్నమెంట్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డా. సీ.హెచ్. చలపతి రావు మాట్లాడుతూ జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించడం ఏడవ సారి అని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్ మాట్లాడుతూ అందిన అవకాశాలని నిరుద్యోగ యువత అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అదిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి పి.సీతారాము, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎన్.మూర్తి, జిల్లా నైపుణ్యాభ్రిద్ధి అధికారి యు. సాయికుమార్, వై.ఎస్.కె ఇన్ఫో టెక్, వారాహ ప్రతినిధులు, జిల్లా నైపుణ్యాభ్రిద్ధి సంస్థ సిబ్బంది హాజరయ్యారు.

విద్యార్థుల ఆరోగ్యంపై సిబ్బంది దృష్టి సారించాలి

విశాలాంధ్ర - బెలగాం : విద్యార్థుల ఆరోగ్యంపై సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన పట్టణంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిశీలన చేశారు. వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం అయిన నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై వసతి గృహ సిబ్బంది, వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉండాలన్నారు. అదేవిధంగా విద్యార్థులతో ఆయన మాట్లాడి సెలవుల్లో ఎవరికైనా ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తాయో అని మరియు ప్రస్తుత ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్యంపై ఉన్న అవగాహన పరిజ్ఞానాన్ని పరీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. చర్మ సంబంధిత వ్యాధులు దరిచేరకుండా ఎక్కువగా జాగ్రత పడాలని అందుకు వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరమన్నారు. చేతికి గోళ్ళు లేకుండా ఉంచాలని, ఆహారం తీసుకునే ముందు, కాలకృత్యాలు తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. నీరు ఎక్కువగా త్రాగాలన్నారు. రక్త హీనత, సీజనల్ వ్యాదులు, పౌష్టికాహారం, రోగనిరోధకశక్తి ఇలా పలు అంశాలపై వివరించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా వెంటనే వైద్య సిబ్బంది దృష్టికి తీసుకురావాలని డిఐఒ జగన్మోహనరావు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి. చినమోహన్ రాయుడు, ఎబివిపి పట్నాయక్, వైద్య సిబ్బంది జయగౌడ్, పార్వతి, పాఠశాల వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

భర్త కొట్టాడని భార్య ఆత్మహత్యా ప్రయత్నం

విశాలాంధ్ర - బెలగాం : భర్త కొట్టాడని భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కురుపాం మండలం చీడుగూడ గ్రామానికి చెందిన తోయక సుశీల ఇంటి వద్దనే ఉంటూ కూలి పని చేసుకుంటుంది. భర్త ఆటో నడుపుతూ ఉంటాడు. ఇద్దరు పిల్లలు. మంగళవారం పిల్లలు స్కూల్కు తీసుకొని వెళ్లే విషయంలో భార్యాభర్తల మధ్య మాటా మాటా పెరిగి గొడవ జరిగింది. ఈ గొడవలో ఆమె చెంపపై గట్టిగా కొట్టాడు. దీనితో మనస్థాపం చెంది ఇంట్లో ఉన్న ఎలకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కింద పడిపోవడంతో గమనించిన ఆమె భర్త మొండెంకల్ పిహెచ్సి కి తీసుకొని వెళ్ళగా అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు.

జోగంపేటలో నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని జోగమ్మపేట గ్రామంలో టీడీపి జాతీయ అధ్యక్షుడు, మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను మంగళ వారం టిడిపి నియోజకవర్గ ఇంచార్జి, మాజీఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేకునుకోసి అంతా కలిసికట్టుగా భువనేశ్వరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమెకు భగవంతుడు నిండు నూరేళ్ళు ఆయురా రోగ్యాలు ఉంచాలని వారంతా కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్ష,కార్యదర్శులు కొల్లి తిరుపతి రావు, రౌతు వేణుగోపాల నాయుడు, టిడిపి నేతలు గొట్టాపు వెంకట నాయుడు, సాల హరిగోపాల్, బొమ్మినాయని లక్ష్మణరావు, టాంకాల శ్రీనివాస రావు, బుడితి శ్రీనివాస్, సబ్బాన శ్రీనివాసరావు, ఉడమల సూర్యనారాయణ, గుంపస్వామి, వెంకటనాయుడు, యోగేశ్వరరావు, సింహాచలం, గంగమ్మ పాల్గొన్నారు.

సాలూరు పురపాలక సంఘం

షార్ట్ టెండర్ నోటీసు

ఆర్.సి.నెం. 15/2023-ఇ1 తే:20-06-2023ది

సాలూరు పురపాలక సంఘమునకు సంబంధించి పురపాలక సంఘ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులు, GGMP నిధులు మరియు సాధారణ నిధులతో చేపట్టబోవు ఈ దిగువ చూపిన పనులకు e-Procurement ద్వారా షార్ట్ టెండర్లను ఆహ్వానించడమైనది.

మొత్తం పనులు	:	90 పనులకు
మొత్తం అంచనా విలువ	:	రూ. 237.08 లక్షలు
టెండర్ డాక్యుమెంట్లు అందుబాటు తేది మరియు సమయం	:	తే. 22-06-2023 ది ఉదయం 11:00 గంటల నుండి
టెండర్లు స్వీకరించుటకు చివరి తేది మరియు సమయం	:	తే. 28-06-2023 ది మధ్యాహ్నం 03:00 గంటల వరకు
టెండర్లు తెరచు తేది మరియు సమయం	:	తే. 28-06-2023 ది మధ్యాహ్నం 04:00 గంటలకు

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : 1) కమీషనరు - 9849905794
2) డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు - 9849906989

ఇతర వివరములకు http://tender.apeprocurement.gov.in వెబ్ సైట్ నందు చూడగలరు.

సం.//- కమీషనర్
సాలూరు పురపాలక సంఘం

నేనొచ్చి లేఔట్ ప్రారంభించాక చెరువు స్థలంలో హెచ్చరిక బోర్డులు పెట్టడంలో మీ ఆంతర్యం ఏంటి?

- లేఔట్ స్థలం సర్వే చేయాలని నెలన్నర క్రిందట రెవెన్యూ వారిని కోరా..
- ప్రభుత్వ, పేదల భూములు కాపాడటంలో మాకు బాధ్యత ఉందని గుర్తు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు ఎమ్మెల్సీ ధన్యవాదాలు
- రెవెన్యూ ఉద్యోగులు, సర్వేయర్ తీరుపై ఎమ్మెల్సీ రఘురాజు ఆగ్రహం

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట మండలం, కాపుసోంపురం పెట్రోలు బంకు సమీపంలో (విశాఖ-అరకు రహదారి పక్కన) ఏర్పాటు చేసిన లేఔట్ ను నేను ప్రారంభించాక ఆ పక్కనే ఆనుకుని ఉన్న చెరువు స్థలంలో రెవెన్యూ, సర్వే ఉద్యోగులు ఇప్పుడు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం పట్ల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. కాపు సోంపురం లేఔట్ వద్దకు రెవెన్యూ, సర్వే ఉద్యోగులను ఎమ్మెల్సీ రఘురాజు మంగళవారం పిలిపించిన అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇక్కడ లేఔట్ వచ్చి వంద ఇళ్ల నిర్మాణం ప్రారంభమైతే చాలామందికి పని దొరుకుతుందని గుర్తు చేశారు. ఇక కొత్తగా వేస్తున్న లేఔట్ భూములను సమగ్రంగా సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని, ఒక్క అంగుళం కూడా ప్రభుత్వ లేదా చెరువు భూమి కూడా ఉండేందుకు ఆస్కారం లేకుండా పక్కాగా సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని నెలన్నర క్రిందట రెవెన్యూశాఖను నేనే స్వయంగా కోరిన విషయం నిజమా, కాదా అని మండల సర్వేయర్ వెంకటరావుని ప్రశ్నించారు. అలాగే తహశీల్దారుకు నేను ఫోన్ చేసి లేఔట్ భూమి సర్వే విషయంపై తాను కాకుండా వేరెవరైనా మీకు ఫోన్ చేశారా? అని అడగ్గా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పక్కన ఉన్న చెరువు స్థలం ఆక్రమణల విషయం అడిగారని చెప్పడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర స్థాయి పదవిలో ఉన్న డిప్యూటీ స్పీకర్ ఒక బాధ్యతగా అడగటం పట్ల ఎమ్మెల్సీ కృతజ్ఞతలు తెలిపారు. ఒక బాధ్యతాయుత పదవిలో ఉన్న తాను ఎప్పుడూ ప్రభుత్వ స్థలాలు, చెరువు గర్భాలు, పేదల భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్‌ను కలిసిన సందర్భంగా కోరిన విషయాన్ని ఎమ్మెల్సీ గుర్తు చేశారు. కొంత మంది నేతలు పెద్ద నాయకుల పేర్లు చెప్పి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ వారిని బెదిరించి డబ్బులు గుంజుతున్న సంఘటనలు కూడా జరుగుతున్నాయని, ఇలాంటివి దురదృష్టం అన్నారు. ఇక వేపాడ, కొత్తవలస, ఎస్.కోట, ఎల్.కోట తదితర మండలాల్లో పెద్దల ఆక్రమణల్లో భూములు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, వీటిపై కూడా తేల్చాల్సి ఉందన్నారు. మాకు పదవిని ఇచ్చింది పేదల భూములు, ప్రభుత్వ భూములను కాపాడటానికి, వారికి సేవ చేయటానికని ఎమ్మెల్సీ రఘురాజు స్పష్టం చేశారు. ఎస్.కోట, కొత్తవలస ప్రాంతాల్లో కొన్ని ఆక్రమణలు జరుగుతున్నాయని, అక్కడ లేఔట్ల వద్దకే రాష్ట్ర, జిల్లా ప్రెస్ మిత్రులను పిలిచి మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ వెల్లడించారు. నేను ఎటువంటి తప్పులకు ఒప్పుకోనని మొదటి నుంచి చెబుతున్నా. ఇక ఎస్.కోటలోని పుణ్యగిరి గెడ్డ, రాజు చెరువులో ఉన్న ఆక్రమణలను కూడా గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఎమ్మెల్సీ రఘురాజు సర్వేయర్, రెవెన్యూ ఉద్యోగులను కోరారు. కొంత మంది పెద్దలు ఇక్కడ ఆక్రమణలను తొలగించాలని.. అక్కడ ఆక్రమణలను ఉంచాలని రెవెన్యూ వారికి సిఫార్సు చేయడం తగదని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హితవుపలికారు. ఎమ్మెల్సీ రఘురాజు వెంట పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

ధర్మవరం కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈఓ

విశాలాంధ్ర - శృంగవరపుకోట : మండలం లోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ (ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల) ను జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల తరగతులను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ఇదే పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత విద్యను ఇదే కళాశాలలో పూర్తి చేసుకోవాలని ఉద్బోధించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో గల ఏకైక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ధర్మవరం కళాశాల అని, ఇక్కడ అమ్మాయిలు చదువుకు అన్ని సదుపాయాలు ఉన్నాయని వెల్లడించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అమ్మాయిలు చదువుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే బదులు శృంగవరపుకోటకి కూత వేటు దూరంలో గల ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ చేసిన అమ్మాయిలకు బోధించడానికి పీజీలు అర్హత కలిగిన అధ్యాపకులను ప్రభుత్వం నియమించిందని, అలాగే అమ్మాయిలకు టెక్స్ట్ పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం పథకం తదితర సౌకర్యాలు అన్నీ కూడా ప్రభుత్వం కల్పించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగ చేసుకోవాలని కోరారు. ఇటీవల పాఠశాల స్థాయిలో పదో తరగతిలో 569 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన మిడతాన లిఖితకు రూ. 3000, 565 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన కరగాని జాహ్నవికి రూ.2,000 "జగనన్న ఆణిముత్యాలు" నగదును పేఎంసీ కమిటీ ప్రెసిడెంట్ తగరంపూడి రమణ, కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు విద్యార్థుల సమక్షంలో నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర్ రెడ్డి, ఇంచార్జ్ హెచ్ఎం శివరామకృష్ణ, పీఎంసీ చైర్మన్ తగరంపూడి రమణ, కళాశాల అధ్యాపకులు రహీమ్ షేక్ లాల్, ఎస్ఎంసీ ఎస్ మూర్తి (సతీష్ మాస్టర్), తమ్మినాన రాజేష్, సురేంద్రనాథ్, జయలక్ష్మి, ఉపాధ్యాయులు విశ్వ సత్యనారాయణ, పి శ్రీరాములు, చింత, ఎల్ఐ సత్యనారాయణ, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత మహిళ కుటుంబాలపై దాడికి దిగిన నాయకులకులారా ఖబర్దార్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : మంగళవారం స్థానిక అంబేద్కర్ భవన్ లో రౌండ్ టేబుల్ సమావేశంలో గత రెండు నెలలు గా విజయనగరం నగర పాలక సంస్థ పరిధిలో అయ్యప్ప నగర్ లో నిర్వహిస్తున్న ప్లాంట్ నిర్వహిస్తున్న దళిత మహిళ పై మరియు 10 మంది దళిత కుటుంబాలపై వివక్ష చూపుతున్న విధానాన్ని ఖండించడం జరిగింది. దళిత వ్యతిరేక విధానాలను విడనాడకపోతే భవిష్యత్తులో తీవ్రమైన అనుభవాలు ఎదుర్కొంటారని హెచ్చరించడం జరిగింది. నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పై తొందరగా విచారణ జరిపి నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరీ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి షరీఫ్,తెలుగుదేశం పార్టీ ప్రతినిధి కందుల ప్రకాష్,జనసేన పార్టీ ప్రతినిధి ఆదాడ మోహన్, లోకసత్తా పార్టీ ప్రతినిధి రాజారావు, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కొమ్ము సోములు, బీజేపీ ప్రతినిధి విలాల్ అహ్మద్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ప్రతినిధులు ధర్మాన శ్రీనివాసరావు, చలికి లక్ష్మణరావు, ఉత్తరాంధ్ర అంబేద్కర్ రైట్స్ డాక్టర్ పొంగ్రంగి వెంకటరమణ, గంటా వీర్రాజు, ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులలోపిండి లక్ష్మణరావు సొంపార అప్పారావు, మాల మహానాడు ప్రతినిధులు జెల్లాన దేవదాస్, తెలుగు రాంబాబు, ఆర్.పి.ఐ ప్రతినిధి విడదల ప్రభాకర్,డొమెస్టిక్ వర్కర్స్ ప్రతినిధి వరలక్ష్మి, పల్లి కల వెంకటలక్ష్మి, ఆంధ్రప్రదేశ్ రెడ్డి రెండు కులాల ప్రతినిధులు బంగారు దుర్గారావ్ సోమ లక్ష్మణరావు ఎర్రం శెట్టి వాలి, అంబేద్కర్ అందరివాడు సాధన సమితి ప్రతినిధులు మల్లాన సతీష్ కుమార్, నాయి బ్రాహ్మిన్ ప్రతినిధి తమరాపు కోటి, మాతా రా బాబాయ్ జై భీమ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మల్లాన స్వాతి, సీపీఐ కాపు సామాజిక వర్గ ప్రతినిధి చందక ఉమామహేశ్వరరావు, సఫాయి కర్మచారి ప్రతినిధి రాజ్ కుమార్, వంశీ, కళ్యాణ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీ శ్మశాన వాటికకు హద్దులు నిర్ధారించాలని సర్పంచ్ వినతి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : శృంగవరపుకోట మేజర్ పంచాయతీ పరిధి ఎస్సీ కాలనీలో గల శ్మశాన వాటికకు సంబంధించి మండల రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో సర్వేలు చేపట్టి, హద్దులు నిర్ణయించాలని కోరుతూ శృంగవరపుకోట మేజర్ పంచాయతీ సర్పంచ్ సంతోషి కుమారి తహశీల్దార్ శ్రీనివాసరావుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎస్సీ కాలనీ శ్మశానంలో క్రిస్టియన్, హిందూ మతాలకు చెందినవారు అంత్యక్రియల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇటీవల ఉంటే క్రిస్టియన్ మతానికి చెందిన వారు భారీ స్థాయిలో సమాధులను నిర్మించడం కారణంగా భవిష్యత్తులో ఈ స్మశానంలో హిందువులకు స్థలాభావం ఏర్పడుతుందని స్థానికులు అందోళన వ్యక్తం చేస్తున్నారని ఆమె తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. హిందూ కులాలకు చెందిన ప్రజలు ఆవేదనను దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఎస్సీ కాలనీలో గల స్మశానాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి క్రైస్తవులు, హిందువులకు వేర్వేరుగా హద్దులు నిర్ణయించాలని తహశీల్దార్ శ్రీనివాసరావును కోరినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో 18 వ వార్డు సభ్యురాలు ఆదారి సూరిబాబు, వెంకటరావు, అర్జున్ పాల్గొన్నారు.

కన్నెంగెడ్డలో పూడికతీత పనులు పరిశీలించిన ఎమ్మెల్సీ రఘురాజు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట మండల కేంద్రం లోని ఎస్.కోట మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో జరుగుతున్న కన్నెంగెడ్డ కాలువలో 1500 మీటర్ల మేర పూడికతీత పనుల ప్రగతిని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భముగా పూడికతీత పనులు మరింత మెరుగ్గా చేయుటకు, మదుములను పూర్తిగా శుభ్రపరచుటకు పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట ఎం.పి.పి సండి సోమేశ్వరరావు, ఎస్.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సంతోషికుమారి, వైస్ సర్పంచ్ సీపీఐ మండల పార్టీ అధ్యక్షులు మోపాడ కుమార్, వార్డు మెంబర్ ఆదారి సూరిబాబు, నాయకులు మోపాడ శ్రీను, సతీష్, పంచాయతీ కార్యనిర్వాహణాధికారి ఇ పాత్రో, పంచాయతీ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్యాలకు కొమ్ముకాస్తున్న ఎంఈఓ సత్యనారాయణని సస్పెండ్ చేయాలి

- గుర్తింపులేని నారాయణ స్కూలును సీజ్ చేయాలి
- పుస్తకాల అమ్మకాన్ని అరికట్టాలి : ఎస్.ఎఫ్.ఐ డిమాండ్

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాల అమ్మకం అరికట్టడంలో నిర్లక్ష్యం వహించిన ఎస్.కోట ఎంఈఓ సత్యనారాయణని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్.కోట తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎస్.ఎఫ్.ఐ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా సామాన్యులకు విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన విద్యాహక్కు చట్టాన్ని తుంగలోకి తొక్కి మండలంలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, యూనిఫారంలు అధిక రేట్లకు అమ్మి వ్యాపారం చేసుకుంటున్నారు. దీనిని నిరసిస్తూ ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో మండలంలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో నిరసన కార్యక్రమం చేయడం జరుగుతుందని తెలిపారు. శృంగవరపుకోట మండల కేంద్రంలో రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతున్న నారాయణ అలియాస్ కేంబ్రిడ్జ్ పాఠశాల వాళ్లు స్కూల్ పేరుతో ఒక ఇంట్లో బహిరంగంగా పుస్తకాలు అమ్మకం చేస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోండి, పుస్తకాల రూమును సీజ్ చేయండి అని శృంగవరపుకోట మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణని అడిగితే సాకులు చెబుతూ మాకేంటి సంబంధం, అది మా పని కాదని యాజమాన్యానికి పూర్తిగా కొమ్ముకాసే భాధ్యత విడువరని వినిపిస్తున్నారని మండిపడ్డారు. ఇలా విద్యార్థులకు న్యాయం చెయ్యాల్సిన ప్రభుత్వ అధికారులే భాధ్యతారాహిత్యంగా ఉంటే మిగిలిన సామాన్య విద్యార్థులకు ఎలా ప్రభుత్వ విద్య అందుతుందని, ఎలా బలోపేతం అవుతుందని ప్రశ్న చారు. తక్షణమే భాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన శృంగవరపుకోట మండల విద్యా శాఖాధికారి పెంట సత్యనారాయణని సస్పెండ్ చేయాలని, విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా సామాన్య విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, గుర్తింపు లేని నారాయణ స్కూలుని సీజ్ చేయాలని, లేని పక్షాన మండల వ్యాప్తంగా విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులని ఐక్యం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ డి.శ్రీనివాసరావుకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ మండల కార్యదర్శి కొర్రా రమేష్, ఎస్.ఎఫ్.ఐ నాయకులు రిషి, రాము, నాయుడు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే సంఘాలకు గుర్తింపు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : సేవ కార్యక్రమాల తోనే సంఘాలకు గుర్తింపు లభిస్తుందని గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా కార్యదర్శి ఏ ఎస్ శర్మ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వి డెంటల్ హాస్పిటల్ లో విజయనగరం సామాజిక గ్రామీణ వైద్యులు సంక్షేమ సంఘం సమావేశం అధ్యక్షులు బి. గోపాల రావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి శర్మ మాట్లాడుతూ ఆపదలో ఆపద్భాంధవుడు గా ఆదుకునే వాళ్లే గ్రామీణ వైద్యులని పేర్కొన్నారు. పట్టణంలోని మురికివాడ లు, గిరిజన, హరిజన వాడలన్ కేదా లేకుండా ప్రజలకు సేవలందించడం వల్ల ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ముందుగా గుర్తొచ్చేది గ్రామీణ వైద్యులే నని అన్నారు. కోశాధికారి కనకారావు మాట్లాడుతూ సేవా భావం తో కూడిన వైద్య వృత్తి చేసే వారికి ప్రజల ఆదరాభిమానాలు లభిస్తాయని చేశారు. అదనపు కార్యదర్శి సోమేశ్వర రావు మాట్లాడుతూ త్వరలో జిల్లా, నియోజకవర్గాల వారీగా జరిగే సమావేశాల విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గౌరి నాయుడు, కిషోర్, సురేంద్ర, కృష్ణంరాజు, త్రిమూర్తులు, సునీత, పైడి నాయుడు కోటి, తిరుపతిరావు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అందుబాటులో సారిపల్లె గృహ సముదాయాలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నివాసయోగ్యానికి అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించి త్వరలో సారిపల్లెలోని 16 నుండి 30 బ్లాక్ ల గృహ సముదాయాలను లబ్ధిదారులకు అందించనున్నామని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ వెల్లడించారు. ప్రస్తుతం నివసిస్తున్న గృహాస్తుల అవసరాలు అడిగి తెలుసుకున్నారు. మంగళవారం ఉదయం సారిపల్లె చేరుకున్న ఆయన లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కనీస మౌలిక సదుపాయాలు సమకూర్చాలని అయితే నిత్యావసరాలు, ఆసుపత్రి, బస్సు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రాధాన్యత క్రమంలో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే అన్నీ పేదలకు జగనన్న కాలనీల పేరిట పట్టాలను మంజూరు చేసి ఇల్లు నిర్మాణాలను కూడా చేపట్టే పరిస్థితి ఉందన్నారు. అలాగే గతంలో టిడ్కో లబ్ధిదారులకు ఇల్లు అందించాలని క్రమంలో సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించి నివాసయోగ్యమైన ఇల్లుగా తీర్చిదిద్ది లబ్ధిదారులకు అందజేసున్నాము. త్వరలో 16 నుండి 30 బ్లాక్ లలో ఉన్న ఇళ్లకు అవసరమైన సదుపాయాలను కల్పించి లబ్ధిదారులకు అందజేయనున్నట్లు చెప్పారు. అనంతరం సోనియా నగర్ చేరుకుని అక్కడ జరుగుతున్న టిడ్కో నిర్మాణ పనులను పరిశీలించారు.జియో టాగింగ్ ఏ విధంగా జరుగుతుందన్న విషయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాములనాయుడు,హౌసింగ్ ఈఈ జ్యోతి, డీఈలు, ఏఈలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సకల జగాలకు రక్షకుడు జగన్నాథ స్వామి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : సకల జగాలకు రక్షకుడు నిలుస్తున్న జగన్నాథ స్వామి రథయాత్ర సందర్భంగా దేవాలయాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద కొలువు తీర్చిన రథ యాత్రలో పాల్గొన్న ఆయన రథంపై జగన్నాథ్, బలభద్ర, సమేత సుభద్రాదేవి విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు వైదిక క్రతువులను నిర్వహించి, ఆశీస్సులను అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లా డుతూ దేశంలో ప్రసిద్ధిగాంచిన పూరీ పుణ్యక్షేత్రంలో కొలువైన జగన్నాథ స్వామి తొలి రథయాత్ర సందర్భంగా దేశంలో అనేక ప్రాంతాలలో ఆ దేవదేవుని కొలువు తీర్చారన్నారు. నగరంలో దాసన్నపేట, సంతపేట, మూడు కోవెళ్లు, కొత్తపేట తదితర ప్రాంతాలలో జగన్నాథుణ్ణి కొలువుదీర్చి రథాలపై ప్రతిష్ఠించడం, ఆ తర్వాత దశావతారాల్లో స్వామి వారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించడం ప్రతి ఏటా వస్తున్న సంప్రదాయం అన్నారు. స్వామిని దర్శించుకున్న అందరికీ సకల సౌభాగ్యాలు ప్రసాదించాలని జగన్నాథ స్వామిని ప్రత్యేకంగా ప్రార్థించానని అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మగంగాడి శ్రీనివాసరావు, నగేష్ పాల్గొన్నారు.

48వ డివిజన్‌లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగరంలోని 48వ డివిజన్ గాజులరేగలోని, పదాల వీధిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును వివరిస్తూ ప్రజాస్పందనను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. కాలువలు, వీధి దీపాలు సరిగా లేవని స్థానికులు వివరించగా వెంటనే అక్కడ ఉన్న అధికారులను పిలిచి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల కాలువల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ సడిపల్లి ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రజా రంజక పాలన సాగుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ప్రజలకు అందుబాటులోకి తెచ్చి పాలన అందిస్తున్నారని, నవరత్నాల వ్యవస్థను ఏర్పాటు చేసి అవినీతి రహితంగా ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు, లబ్ధిదారులకు అందే విధంగా చూస్తున్నారన్నారు. దేశంలోనే తొలిసారిగా ప్రజల చెంతకే పాలనను తీసుకుని వెళుతున్నారని కొనియాడారు. స్థానికంగా శాసనసభ్యులు కోలగట్ల వీరభద్ర స్వామి నగర అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఐదులో భాగంగానే ప్రధాన జంక్షన్ల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ఫుడ్ బ్యాంకుల ఏర్పాటు వంటి అనేక ప్రజాహిత కార్యక్రమాలు సాగుతున్నాయన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు మధు మాట్లాడుతూ తమ డివిజన్ పరిధిలో ఆరవ రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతోందన్నారు. ప్రతిరోజు కార్యక్రమానికి విచ్చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఎంతో ఓపికతో నవనంతో ఇంటింటికి వెళుతూ ప్రజలను కలుస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడమే కాకుండా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా సూచనలు చేయడం విశేషం అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, మాజీ కౌన్సిలర్ గార సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రహదారులను ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగరంలోని 6,7 డివిజన్లలో 24 లక్షల వ్యయంతో నిర్మించిన రహదారులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. ఆయా డివిజన్లకు చేరుకున్న ఆయనకు స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మంగళవారం 35 లక్షల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దాలన్న ధ్యేయంతో ఆయన కృషి చేస్తున్నారన్నారు. 7వ డివిజన్ కార్పొరేటర్ పొంతపల్లి మాలతి మాట్లాడుతూ తమ డివిజన్లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కల్పిస్తున్నారన్నారు. తమ ప్రాంతంలో ప్రజల దాహార్తిని తీర్చే వాటర్ ట్యాంకును నిర్మించడం, కాలువలు రహదారులు ఏర్పాటు చేయడం, అవసరమైన వారికి కుళాయి కనెక్షన్ ఇవ్వడం ఇలా అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నారన్నారు. 6వ డివిజన్ కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన తమ వార్డు అభివృద్ధికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఎంతగానో అభివృద్ధి పరుస్తున్నారన్నారు. రహదారులకు శంకుస్థాపన చేసిన అనతి కాలంలోనే ప్రారంభోత్సవాలు కూడా చేయడం ఆనందంగా ఉందన్నారు. జోనల్ ఇన్చార్జ్ బొద్దాన అప్పారావు మాట్లాడుతూ నగరంలో ఏటు చూసినా అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, శాసనసభ్యులుగా కోలగట్ల వీరభద్ర స్వామిని మరోసారి ప్రజల ఆశీస్సులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జులు కోలగట్ల కృష్ణారావు, బంగారు నాయుడు, ముచ్చు శ్రీనివాసరావు, మారం బాల బ్రహ్మారెడ్డి, బోడ సింగి ఈశ్వరరావు, వైసీపీ నాయకులు ఆల్తి శ్రీనివాసరావు, పొంతపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

పుణ్యగిరి గెడ్డ ఆక్రమణ సమస్య పరిష్కరించాలని రజకులు ధర్నా

నేటి నుండి నిరసనలకు రజకులు పిలుపు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : పుణ్యగిరి గెడ్డ ఆక్రమణ సమస్యను పరిష్కరించకుంటే తీవ్రమైన నిరసన కార్యక్రమాలు చేపడ తామని రజకులు హెచ్చరిస్తూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం అధ్యక్షుడు రేగలంబ బిట్టిబాబు మాట్లాడుతూ పుణ్యగిరి గెడ్డ భూమిలో పూర్వకాలం నుండి రజక కుటుంబాలు బట్టలు ఉతికి జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే ఈ గెడ్డ భూమిలో ఉన్న సుయ్యి, బట్టలు ఉతికే ఒక వ్యక్తి కప్పేసిన విషయం జిల్లా కలెక్టర్, ఇతర అధికారుల దృష్టికి తీసుకువచ్చామని తెలిపారు. అయితే గెడ్డ స్థలాన్ని కొలిచి సర్వే నెంబర్ 488లో గల జిరాయితీ స్థలాన్ని సర్వే చేయకపోవడంతో ఉన్న మతలబేంటని ప్రశ్నించారు. మా స్థలంలో వృత్తి పని చేసుకునేలా న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో నేటి నుండి తహశీల్దార్ కార్యాలయం ఎదుట వంటావార్పు, చాకిరేవు, రిలే దీక్షలు, ఆమరణ దీక్షలతో పాటు ఇస్త్రీలు, బట్టలు ఉతికే పనులు ఆపుదల, చావు, పుట్టుక, సువార్త, మైలబట్టలు ఉతకమని హెచ్చరించారు. ఇప్పటికైనా తమ రజకులు ఎదుర్కొంటున్న స్థల ఆక్రమణ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంధవరపు సాయి, సన్యాసిబాబు, బి.ఎర్రినాయుడు, కె.నాగరాజు, కె.అప్పారావు, బి. చిన్న, బి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో "అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : అంతర్జాతీయ యోగా దినోత్సవం బుధవారం పురస్కరించు కొని అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 42వ డివిజన్ కామాక్షినగర్, లొవింగ్ షేఫర్డ్ అర్ఫన్స్ హోమ్ లో యోగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ - 102 గవర్నర్ కర్రోతు సత్యం, లొవింగ్ షేఫర్డ్ అర్ఫన్స్ హోమ్ చైర్మన్ పాస్టర్ సునీల్ కుమార్ హాజరయ్యారు. ముందుగా యోగా గురువు ఆర్ సుందర శివరావు యోగా యొక్క విశిష్టతను సభ్యులందరికి వివరిస్తూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు పూర్వం రెండువందల సంవత్సరాల క్రితం పతంజలి రచించిన యోగ నేడు విశ్వవినిమై ప్రపంచంలో సుమారు 180 దేశాలకు పైగా యోగ విని యోగించుకోవడం వెలుగొందుతుందని అన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన వాకర్స్ క్లబ్ గవర్నర్ కర్రోతు సత్యం, పాస్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ మంచి ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ వయస్సుతో సంబంధం లేకుండా ధ్యానం, యోగాసనాలు వేయాలని, కరోనా సంక్షోభ కాలంలో యోగా ప్రాముఖ్యతను ప్రపంచదేశాలు గుర్తించాయని, యోగాలో ప్రాణాయామ ప్రక్రియ మనిషిలో రోగనిరోధక శక్తులను పెంచి, రక్తప్రసరణ బాగుంటుందని, ఉపిరితిత్తులు బలోపేతమై ఆరోగ్యంగా జీవిస్తారని తెలిపారు. అనంతరం ఆర్ఫన్ విద్యార్థులతో పాటు సభ్యులందరికి యోగాసనాలు వేసి, ధ్యానం ఆసనాలపై అవగాహన కల్పించారు. చివరగా యోగా గురువు సుందర శివరావు కు వాకర్స్ క్లబ్ పెద్దలంతా సత్కరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ -102 ఎలక్ట్ గవర్నర్ శ్రీరామ్మూర్తి, రీజనల్ కౌన్సిలర్ -3 కె.ఎర్రాయుడు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రెటరీ టి.చిరంజీవి రావు, క్యాబినెట్ ట్రెజరర్ రమణ మూర్తి మాస్టారు,శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సి. హెచ్.రమణ,ఉపాధ్యక్షుడు వై.నలుసుపతిరావు, అంజనీపుత్ర వాకర్స్ క్లబ్ పెద్దలు ఆదాడ మోహనరావు,పోస్ట్ మాస్టర్ రమణ, సభ్యులు బి.మధు, చాణక్య, పతివాడ శ్రీను పాల్గొన్నారు.

నేడు విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నా

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : విద్యుత్ చార్జీలు పెంపుదలకు నిరసనగా పార్వతీపురం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీతో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పార్వతీపురం పట్టణ కార్యదర్శి రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై పెనుభారం వేస్తున్నారని, ట్రూ అప్ సర్దుబాటు చార్జీలు వసూళ్లు నిలిపివేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టరాదని డిమాండ్ చేశారు. నష్టి పిరుస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీల పెంపుదలను ప్రతిఘటించాలని ఈ నెల 21 న బెలగాంలో గల విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద జరుగు ధర్నా కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి, వి.రాజశేఖర్, మరియు బలరామ, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడే యోగా డే

విశాలాంధ్ర - విజయనగరం : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో యోగ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయుష్ వైద్యులు డా.వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటల నుండి 8 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజలంతా ఆహ్వానితులేనని, పెద్ద సంఖ్య లో హాజరై యోగా నిపుణుల సూచనల తో తమ ఆరోగ్యాలను మెరుగుపరచుకో వచ్చునని తెలిపారు.

గిరిజనుల దాహార్తి తీర్చండి

సీపీఐ కార్యదర్శి కూరంగి మన్మధరావు

విశాలాంధ్ర - సీతంపేట : మండలం గాడిదపాయ గ్రామంలో త్రాగునీరు సమస్యతో గిరిజనులు అల్లాడిపోతున్నారని ఐటిడిఎ అధికారులు స్పందించి త్రాగునీరు సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు తెలిపారు. గిరిజన ప్రాంతాలలో ఈ వేసవి కాలంలో ఎత్తైన కొండ ప్రాంతాలలో గుక్కెడి నీటి కోసం మైళ్ళ దూరం వెళ్లి కొండ చలమనీరు త్రాగి రోగాల పాలవుతున్నప్పటికీ అధికారులకు మాత్రం గిరిజనులపై ఎటువంటి దయ లేకుండా నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని కూరంగి మన్మధరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. త్రాగునీరు సమస్యపై తాడిపై సర్పంచి సోమేశ్వరరావు తో చర్చించి అనేకసార్లు ఐటిడి ఎ ప్రాజెక్ట్ అధికారికి వినతిపత్రం అందించినప్పటికీ త్రాగునీరు సమస్యపరిష్కరించలేకపోవడంపై మన్మధర ఆవేదన వ్యక్తం చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యవసరాలు పంపిణీ

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలోని అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవంతుడు మంగళవారం నిత్యవసర సరుకులను అందించారు.అలాగే అగ్ని ప్రమాదం ఏ విధంగా సంభవించిందని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ప్రభుత్వం నుండి రావాల్సిన ఆర్థిక సహాయాన్ని తొందరగా అందే విధంగా చూస్తానన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అడప ఈశ్వరరావు,స్థానిక ఉప సర్పంచ్ శ్రీను, ఎంపీటీసీ తొండవరపు వెంకట రమణ, సోంపురం ఎంపీటీసీ, ఆకలి సత్యనారాయణ జగ్గయ్యపేట గ్రామ వైసిపి నాయకులు నాయుడు, కాసు బాబు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

విశాలాంధ్ర - రామభద్రపురం : మండల పరిధిలోని భూసాయ వలస దగ్గర26వ నెంబర్ జాతీయ రహదారిపై స్థానిక ఎస్ఐ సురేంద్ర నాయుడు మంగళవారం మధ్యాహ్నం వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను పరిశీలించారు. పత్రాలు సరిగా లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. అలాగే వాహనదారులకు రోడ్డు నిబంధనల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిల్లిలో పూడిక తీతలు

విశాలాంధ్ర - రామభద్రపురం : మండలంలోని రొంపిల్లి గ్రామంలో మంగళవారం గ్రామ సర్పంచ్ భవిరెడ్డి పెంటమ్మ గ్రామ కార్యదర్శి శంకర్రావు ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న కాలువలలో చెత్తాచెదారం తీయించి ట్రాక్టర్ల ద్వారా ఊరికి దూరంగా వున్న డంపింగ్ యార్డ్‌కు తరలించారు. అలాగే దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ గ్రామం అంతా క్లోరినేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భవిరెడ్డి శంకర్రావు పాల్గొన్నారు.

జామి ఎంఈఓ -2 గా గంగరాజు బాధ్యత స్వీకరణ

విశాలాంధ్ర - జామి : మండల విద్యాశాఖ అధికారి-2 గా కోట గంగరాజు బాధ్యతలను స్వీకరించారు .రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలానికి ఇద్దరు ఎంఈఓ లను నియమించడంతో అందులో భాగంగా జామికి రెండవ ఎంఈఓగా గంగరాజు నియమితు లయ్యారు. ఆయన మెంటాడ మండలం పోరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ పదోన్నతి పై ఇక్కడకు వచ్చారు. మంగళవారం ఆయన జామి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అల్లువీధిలోని ప్రాథమిక పాఠశాలలో తనిఖీలను నిర్వహించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై పరిశీలన చేశారు. అలాగే జగనన్న విద్యా దీవెన కిట్ల పంపిణీ పై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి పాఠశాలలో తాను నిత్యం పరిశీలన చేస్తానని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : ఎంపీపీ ప్రమీల

విశాలాంధ్ర - పాచిపెంట : వర్షాకాలంలో విష జ్వరాలవలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని ఎంపీపీ బి ప్రమీల అన్నారు మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని కేసలి పంచాయతీ కుంతాం గ్రామానికి చెందిన పెదకాపు లిడియా (5) ఏళ్ల బాలిక జ్వరంతో బాధపడుతూ విశాఖ కేజీహెచ్ లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. లిడియాకు ఈనెల 14వ తేదీన జ్వరం రాగా అతని తండ్రి పెదకాపు రమణ 15వ తేదీన పాచిపెంట పిహెచ్సికి తీసుకువచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు తీసుకొని మరల ఇంటికి తీసుకు వెళ్ళిపోయాడు, మందులు వాడుతుండగా మరల 18వ తేదీన జ్వరం రావడంతో స్థానిక ఆశ వర్కర్ సహాయంతో సాలూరు

సిహెచ్సి కి తీసుకెళ్లాడు అక్కడ చికిత్స పొందుతున్న సమయంలో ఫిట్స్ రావడంతో అక్కడ వైద్యులు వెంటనే విజయనగరం తరలించారు. పరిస్థితి విషమంగా అక్కడి నుంచి అదే రోజు రాత్రి కేజీహెచ్ కు తరలించారు. కేజీహెచ్ లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు స్థానిక వైద్యులు తెలిపారు... విషయం తెలుసుకున్న పాచిపెంట ఎంపీపీ బడ్నాన ప్రమీల మంగళవారం ఉదయం స్థానిక పీహెచ్ సీ కి వెళ్లి బాలిక మృతిపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది ఏఎన్ఎం లతో సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో విష జ్వరాలను ప్రబలే అవకాశం ఉందని, ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అదేవిధంగా గిరిజన గ్రామాల్లో ప్రజలు చిన్నపాటి జ్వరం వచ్చినా కూడా చిల్లంగి కీటకం అని చెప్పి నాటు వైద్యం వాడి మృత్యువాత పడుతున్నారని, గ్రామాల్లో మూఢనమ్మకాలపై అవగాహన సదస్సులు ర్యాలీలు నిర్వహించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యతిస్తూ కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. పేదవాడి వైద్యానికి ఇన్ని కోట్ల రూపాయలకు ఖర్చు చేస్తున్న విష జ్వరాల ద్వారా మరణాలు సంభవిస్తు న్నాయంటే మరి దానికి బాధ్యత ఎవరు వహిస్తారని సిబ్బందిని నిలదీశారు ఈమె వెంట వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపంట వీరం నాయుడు ఉన్నారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - చీపురుపల్లి : ఈ రోజు చీపురుపల్లి నియోజకవర్గం చీపురు పల్లి మండలం కర్లాం పంచాయతీ గడప గడప కి మన ప్రభుత్వం కార్య క్రమంలో పాల్గొన్న చీపురుపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు ఇప్పిలి వెంకట నర్సమ్మ జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష గారు వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇప్పిలి అనంతం వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు వివరించి సమస్యలు అడిగి తెలుసు కున్నారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని,ఏ ప్రభుత్వం చేయనటు వంటి సంక్షేమ పథకాలు నేరుగా

వాలంటరీ, సచివాలయ వ్యవస్థ పెట్టి ప్రజలు ముంగిటికే పాలన అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలను నేరుగా కలుసుకుని వారు పొందిన సంక్షేమ పథకాలను మరొకసారి గుర్తు చేస్తూ అర్హత కలిగి సంక్షేమ పథకాలు, పింఛన్లు, రేషన్ కార్డ్ ఇలా ఏ ఒక్కటీ పొందలేకపోతున్నా వారి వివరాలను అడిగి తెలుసుకుని అర్హత మేరకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామ న్నారు. ఈ కార్య క్రమంలో కర్లాం పి.ఏ.సి.ఎస్ అధ్యక్షులు చందక గురు నాయుడు, కర్లాం సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి, శ్రీనివాస్ రావు ఎం.పి.టీ.సి బాణాన రాజారత్నం, రమణ ఇటకర్లపల్లి సర్పంచ్ మీసాల రమణ, ఎం.పి.డీ.ఓ కె.రామకృష్ణం రాజు, ఎం.ఆర్.ఓ సురేష్, పి.హెచ్. సి.డాక్టర్ శ్రీలక్ష్మి, ఇ.ఓ.పి.ఆర్.డి అన్నపూర్ణ దేవి, ఏ.పి.ఎం ఓభాగ్యలక్ష్మి, రెవిన్యూ సిబ్బంది, మండల అధికారులు, గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, వైస్సార్ క్రాంతి పథం సిబ్బంది, ఆర్.ఇ.సీ.ఎస్ సిబ్బంది, పీహెచ్సీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది శివాలయం డైరెక్టర్ ప్రభాత్ కుమార్ చీపురుపల్లి మండల పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మొండేటి కిషోర్ చీపురుపల్లి మండల పార్టీ సోషల్ మీడియా కో కన్వీనర్ బైరెడ్డి కామేష్ రౌతు భాస్కరరావు దన్నాన సత్యం సచివాలయ కన్వీనర్లు, పాల్గొన్నారు.

పేద ప్రజల అభ్యున్నతే చంద్రబాబు మేనిఫెస్టో

విశాలాంధ్ర - పాచిపెంట : పేద ప్రజల అభ్యున్నత ధ్యేయంగా పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మేనిఫెస్టో ఉందని దీని ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత మనందరిపై ఉందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెండింటి ప్రసాద్ బాబు అన్నారు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పేదవాడికి లబ్ధి చేకూర్చే విధంగా అద్భుతంగా మేనేఫెస్ట్ విడుదల చేయడం తెలుగు తమ్ముళ్ల తో పాటు రాష్ట్ర ప్రజలలో అన్నారు అంతేకాకుండా ఈ మేనిఫెస్టోని ప్రజల్లోకి తీసుకువెళ్లి మరింత అవగాహన పెంచాలని నాయకులను కార్యకర్తలను కోరారు త్రిసభ్య కమిటీలో తనకు చోటు లభించడం తనపై పార్టీకి ఉన్న నమ్మకమేనని అన్నారు సాలూరు నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన వ్యక్తి గెలుపునకు మనమంతా సంఘటితంగా కృషి చేయాలని ఆయన కోరారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించేపార్టీ సమావేశానికి హాజరు కావాలని సమాచారం అందిందని ఆయన అన్నారు 50 మంది ప్రయాణించే బస్సులో బస్సులో తనకు చోటు లభించడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంతోషి మిత్తువల్ సర్పంచ్ ప్రతినిధి తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ తొమ్మిదేళ్లు పాలనలో ప్రజలకు చేసిన అభివృద్ధిని ఇంటింటికీ వివరిస్తున్నాం

బీజేపీ ప్రధానకార్యదర్శి మోహన్

విశాలాంధ్ర - వంగర : దేశ ప్రధాని మోడీ గత తొమ్మిదేళ్ళ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షే మ పథకాలను ఇంటింటి కెళ్లి కరపత్రం ఇచ్చి తెలియ జేస్తున్నట్లు విజయనగరం జిల్లా బీజేపీ జిల్లా ప్రధాన కార్యర్శి ఉత్తరావెల్లి మోహన్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు ఉదయాన చిన్నన్నాయుడు మండల పార్టీ అధ్యక్షులు ఉదియాన తవిటి నాయుడులు తెలిపారు.మంగళవారం నాడు వీరు వంగర మండలం లో గల శివ్వాం గ్రామంలో ఇంటింటికెళ్లిమోడీ చేసిన సంక్షేమ, అభివృద్ధి కర పత్రాలను అందజేస్తున్నారు. గ్రామంలో అన్ని ఇళ్లకు వెళ్లి వాటిని పంపిణీ చేస్తూ,ప్రస్తుత వైసీపీప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియ జేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంగా తెలిపారు.మహాజన్ సంపర్కక్ అభియాన్‌లో భాగంగా ఈ కార్యక్రమానికి బీజేపీ పార్టీ శ్రీకారం చుట్టిందున్నారు. ఇందులో పార్టీ అధ్యక్షులు నుండి బూత్ కమిటీ అధ్యక్షుని వరకూ ఆయా గ్రమాల్లోకనీసం 100 ఇళ్లకైననూ వెల్ల వలసి ఉంటుందన్నా రు.ఈ విధంగా అంతటా తిరిగి ఈ కరపత్రాలు ద్వారా అభివృద్ధి కార్యక్రమాల ను వివరించ నున్నామన్నారు. మొత్తం ఈ విధంగా ఒకే రోజు 35 లక్షల కుటుంబాలకు కలవనున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడుమృతి

విశాలాంధ్ర - పార్వతీపురం : పేదరికంలో పుట్టి జల్సాచేయాల్సిన రోజుల్లో కుటుంబ బారం తనపై ఉందని గుర్తించి, కుటుంబంలో తల్లి దండ్రులను, చెల్లెలిని పోషించ దానికి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న 26ఏళ్ల గిరిజన యువకుడు మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని నుజ్జు నుజ్జయి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దీన్ని చూసిన వారంతా భయం తో కళ్ళుమూసుకొని అయ్యోరామా అనడం స్పష్టంగా కనిపించింది. వివరాలు పరిశీలిస్తే కొమరాడ మండలంలోని కోటిపాం గ్రామానికి చెందిన వై. ధర్మారావు కుటుంబ ఆర్థిక పరిస్తితుల దృష్ట్యా డిగ్రీ చదివి విశాఖపట్నంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. తనతల్లికి ఆరోగ్యం బాగాలేదని తెలిసి వచ్చిన ధర్మారావు మంగళవారం నాడు ఉదయం స్వగ్రామం కోటిపాం నుండి విశాఖట్నం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నరిసిపురం - మరిపివలస మధ్యలో గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొనడంతో ఆతడు నుజ్జు నుజ్జయి చెల్లాచెదురుగా మృతదేహం పడిఉంది. సమాచారం అందుకున్న పార్వతీపురం గ్రామీణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శవపంచనామా నిర్వహించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సింహాచలం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందజేసారు. ఆసుపత్రివద్ద కుటుంబ సభ్యుల, బంధువుల రోదనను చూసిన వారంతా కూడా కన్నీరు మున్నీరుగా విలపించారు. తల్లిదండ్రులకు మృతుడు ఆధారంగా ఉండటమేకాక పెళ్లీడుకు వచ్చిన చెల్లికి పెళ్లిచేస్తానని చెప్పిన ధర్మారావు తమని విడిచి అనంత లోకాలకు వెళ్లిపోయాడని, తమని ఎవరుచూస్తారని వారి రోదన, అవేదన చూసిన వారంతా అయ్యో విధిరాత ఇలా ఉంటుందా!అని అనుకోవడం గమనార్హం. వ్యసనాలు లేని పేరుకు తగ్గ ధర్మారావు మృతిని కోటిపాం గ్రామస్తులు కూడా జీర్ణించుకోలేక పోతున్నారు. మృతుని కుటుంబ సభ్యులను ప్రభుత్వము ఆదుకోవాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు.

చింతాడలో రెండు బోర్లు ప్రారంభం

విశాలాంధ్ర - జామి : మండలంలోని చింతాడ గ్రామంలో మండల పరిషత్ 15వ ఫైనాన్స్ నిధులు నుంచి రెండు మంచి నీటి బోరు బావులు తవ్వించుటకు మంజూరు అయినట్లు సర్పంచ్ అప్పాన సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం గ్రామంలో నీటి ఎద్దడి ప్రాంతంలో బోర్లు తవ్వించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యంపిటిసి సభ్యులు పి.స్వామినాయుడు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు వస్తుందని అడ్డుకోవడంతో మహిళపై దాడి

విశాలాంధ్ర - బెలగాం : మురికి నీరు వస్తుందని అడ్డుకోవడంతో మహిళపై దాడి చేయడంతో గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మున్సిపల్ కొత్తవలస ప్రధాని రహదారిలో ఉంటున్న ముప్వల రవణ గృహిణిగా ఉంటుంది. తన పక్కింట్లో ఉన్న సువ్వాడ అప్పలరాజు, భవానీలు తనతో ఎప్పటికప్పుడు లేనిపోని సూటి మాటలలు ఆడడం చేస్తుండడంతో వారి మధ్య పడదు. మంగళవారం ఉదయం వాళ్ళ ఇంటి నుండి తన ఇంటికి మురికి నీరు వస్తుందని అడగగా మా ఇష్టం నీరు వస్తే వస్తాదని చెప్పడంతో రవణ మట్టి అడ్డుగా వేసింది. దీనితో వారి మధ్య గొడవ జరిగి సువ్వాడ అప్పలరాజు, భవానీలు కొట్టి నైటీ పట్టుకొని కింద తోసివేయడం అప్పలరాజు కుమార్తె సంతోషి రాయితో నుదురుపై కొట్టడంతో గాయాలయ్యాయి. గమనించిన రవణ బంధువులు ఆమెను పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి డిసిఎంఎస్ సమీక్ష సమావేశంలో పాల్గొన్న అవనాపు భావన విక్రమ్

విశాలాంధ్ర - విజయనగరం : అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ సచివాలయ భవనంలో జరిగిన రాష్ట్రస్థాయి డిసిఎంఎస్ సమీక్ష సమావేశంలో ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన , శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇన్చార్జ్ అవనాపు విక్రమ్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి గౌ.శ్రీ కాకాని గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ సమావేశంలో ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న సహకార మార్కెటింగ్ లక్ష్యాలను వివరించారు. వ్యాపారాభివృద్ధికి తీసుకున్న చర్యలను సమీక్షా సమావేశంలో ప్రస్తావించారు. ఈ రివ్యూ మీటింగ్ లో ఏపి మార్క్ఫెడ్ చైర్మెన్ పిపి నాగిరెడ్డి , కో-ఆపరేటివ్ ఎడ్వజర్ బ్రహ్మానంద రెడ్డి మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరిగ ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సొసైటీ కమీషనర్ ఏ.సాయిబాబు వ్యవసాయ అనుబంధ శాఖలకు చెందిన పలువురు అధికారులు, రాష్ట్రంలో వివిధ డిసిఎంఎస్ చైర్మెన్ లు పాల్గొన్నారు. సమావేశం అనంతరం అవనాపు విక్రమ్ దంపతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిగారికి పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి సత్కరించారు.

అగ్నిబాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కోళ్ళ

రూ.5 వేల ఆర్థికసాయం అందజేత

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని జగ్గయ్యపేటలో అగ్నిభాధిత కుటుంబాన్ని శృంగవరపు కోట ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ళ రాంప్రసాద్, పలువురు మండల టీడీపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందని అడిగితెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో రెండు గ్యాస్ సిలిండర్లతో పాటు హెూటల్ సామగ్రి అంతా కాలిపోయి తీవ్రంగా నష్టపోయామని భాధితులు చెప్పగా తమ వంతు సాయంగా రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అలాగే గ్యాస్ ఏజన్సీ ప్రతినిధులతో మాజీ ఎమ్మెల్యే కోళ్ళ ఫోన్ లో మాట్లాడి బాధితులకు సహకారం అందించవలసిందిగా కోరారు. ఈ పరామర్శలో టీడీపీ నాయకులు పోతల వెంకటరమణ, కొట్యాడ రమణమూర్తి, గొర్రుపోటు రాము, గోకేడ అచ్చం నాయుడు, గోకేడ నాగభూషణం, రంధి మహేష్, బూసరి కృష్ణకుమార్,గోకేడ సత్యం, కోన సత్యం, నాగిరెడ్డి ముత్యాలనాయుడు, నిరుజోగి అమ్మతల్లి నాయుడు, నిరుజోగి బంగారునాయుడు, అక్కిరెడ్డి వెంకటరమణ, ఎల్ కోట మాజీ ఎంపీపీ కొల్లి వెంకటరమణ, పుట్టా శ్రీనివాసరావు, రమేష్ నాయుడు తదితరులు పాల్గొని అగ్ని బాధితులను పరామర్శించారు.

సహకరించిన సిబ్బంది అందరికీ రుణపడి ఉంటా

పూర్వపు తహశీల్దార్ కృష్ణంరాజు

విశాలాంధ్ర - వేపాడ : తహసీల్దార్ గా పనిచేసిన రెండున్నరేళ్ల పాటు సహకరించిన రెవిన్యూ ఉద్యోగులందరికీ రుణపడి ఉంటానని పూర్వపు మండల తహసీల్దార్ ఎస్ కృష్ణంరాజు అన్నారు. స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించి వివిధ మండలాలకు బదిలీపై వెళ్లిన మండల తహసీల్దార్ కృష్ణంరాజు, ఉపతహసీల్దార్ రామకృష్ణ, గ్రామ రెవిన్యూ అధికారులు రామాంజనేయులు, గౌరీశంకర్ లను మంగళవారం కార్యాలయం రెవిన్యూ అధికారులు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణంరాజు మాట్లాడుతూ ఇక్కడ పనిచేసినంత కాలం నాయకులు ప్రజలతోనే కాకుండా కార్యాలయం సిబ్బందితో కూడా సఖ్యతగా మెలిగి పారదర్శకంగా విధులు నిర్వహించగలిగానని మీ అందరి సహకారం మరువలేనన్నారు. తనను ఘనంగా సన్మానించినందుకు సర్వదా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉప తహసీల్దార్ సన్యాసినాయుడు, రెవిన్యూ ఇనస్పెక్టర్ రామలక్ష్మి, మండల సర్వేయర్ అప్పలనాయుడు,సీనియర్ అసిస్టెంట్ ఖలీల్, వీఆర్వోలు, గ్రామ రెవిన్యూ సహాయకులు, సచివాలయాల సర్వేయర్లు, ఇతర సిబ్బంది పాల్గొని వారికి వీడ్కోలు పలికారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఏపీడీ

విశాలాంధ్ర - వేపాడ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం వేతనదారులు కొలతలు ప్రకారం పనిచేసి ప్రభుత్వం కేటాయించిన మొత్తం వేతనంగా పొందాలని శృంగవరపుకోట క్లస్టర్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీడి ఎస్. శారద దేవి అన్నారు. మండలంలోని జగ్గయ్యపేట గ్రామానికి చెందిన పున్నమిరాజు చెరువులో చేపట్టే ఉపాధి పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వేతనదారుల మస్తరులను పరిశీలించడంతో పాటు వారి యొక్క జాబు కార్డు నెంబర్లను అడగడంతో తెలియదని చెప్పడంతో, వేతన దారులంతా తమ తమ జాబు కార్డు నెంబర్లు గుర్తుంచుకోవడమే కాకుండా, పని వద్దకు తప్పనిసరిగా జాబ్ కార్డులు తెచ్చుకోవాలన్నారు.పనుల పరిశీలనకు వచ్చే అధికారులు అడిగినప్పుడు విధిగా జాబు కార్డును వేతన దారులు తప్పక చూపించాలన్నారు. ఒక్కొక్కరికి ఎంత వేతనం వస్తుందని అడగ్గా రూ.240 రూపాయల వరకు వస్తుందని చెప్పగా మొత్తం రూ. 270లు కిట్టేటట్టు పనిచేయాలని మీరు తక్కువ పని చేయడం వలన ప్రభుత్వానికి రూ.30లు ఉండి పోతుం దని ఆ మొత్తాన్ని కూడా వేతన దారులు పొందాలని సూచించారు. మొత్తం వేతనం రావాలంటే బంటాలనులోతు ఎక్కువగా ఉండేలా తీయాలన్నారు. వేతన దారులు చేసే పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.పండ్ల తోటలు పెంపకం సంబంధించి ఉపాధి పథకం ద్వారా మొత్తాన్ని చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ గణేష్, జేఈ దేముదు నాయుడు, క్షేత్ర సహాయకురాలు ఎర్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పశుబీమాపై అవగాహన

విశాలాంధ్ర - తెర్లాం : మండలంలో ఉద్దవోలు గ్రామంలో మంగళవారం పశుభీమ అవగాహన మీటింగ్ కి హాజరైన ముఖ్య అతిథి డా.విశ్వేశ్వరరావు (జాయింట్ డైరెక్టర్) విజయనగరం వారు హాజరు అయ్యారు. ఈ కార్యక్రమం లో పశువులు ఆవులు, గేదెలు, ఎద్దులు మేకలు, గొర్రెలు ప్రమాదవశాత్తు కానీ , జబ్బు ద్వారా కానీ చనిపోయిన వాటికి పసుభీమా యొక్క లాభాలు ను క్లుప్తంగా వివరించారు .ఆవుకి గాను 397 (3 సంవత్సారాలు), గొర్రెలు మరియు మేకకు 36 రూ (1సంవత్సరం) రైతు భరించ వలసిందిగా తెలియజేయడం అయింది. ఈ కార్యక్రమంలో ఉద్దవోలు గ్రామం లో 52 ఆవులకు గాను పసుభీమ కట్టి ఉన్నారు. ఈ కార్యక్రమం లో డా.నీలమ్మ (డిప్యూటీ డైరెక్టర్), డా.నాగరాజు (అడిషనల్ డైరెక్టర్), డా.అరుణ(విఏఎస్), డా.నరేంద్ర కుమార్ (విఏఎస్)మరియు ఏహెచ్ఏలు పాల్గొనడం జరిగింది. అనంతరం బాడంగి, తెర్లాం మండలంలో పనిచేస్తున్న పశుసంవర్థక సహాయకులు (ఏహెచ్ఏ) పశుభీమా గురించి రివ్యూ చేయడం జరిగింది.

మత్తు మందు, దిశా యాప్‌పై అవగాహన

విశాలాంధ్ర - వంగర : మద్యం, మత్తు మందుల దుర్వినియోగ వ్యసనం క్రమంగా ఒక ప్రజారోగ్య సమస్యగా రూపుదాల్చుతోందని, ప్రత్యేకించి యువతలో, కిశోర ప్రాయంలోని వారిలో ఈ రుగ్మత ఎక్కువగా ఉందని ఎస్ఐ జనార్ధన రావు సూచించారు. మంగళవారం నాడు అయన మెట్ట మగ్గూరు, ఓనే అగ్రహారం కూడిలిలో మహిళలు,పురుషులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను,దిశా యాప్ పై పలు సూచనలు చేశారు. సమాజం అధునాతన జీవన శైలికి అలవుడుతున్న నేపథ్యంలో, ఈ సమస్య మరింత విస్తృతరూపం దాల్చే ఆస్కారం ఉందన్నారు. ప్రవర్తనాపరమైన ప్రతికూల పరిణామాల కారణంగా ఆత్మహత్యల వేగం పెరిగిందని, కోవిడ్ మహమ్మారి నేపథ్యంలో ఇది మనకు అనుభవమైందని ఆయన చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు దేశవ్యాప్తంగా ఆరోగ్య మంత్రిత్వ శాఖ, సంబంధిత ఇతర వర్గాల ఆధ్వర్యంలో వ్యసనాలను మాన్పించే కార్యక్రమం చేపట్టడం జరిగిందనీ ఆయన అన్నారు. మద్యం, మత్తు మందులకు బానిసలయ్యే రుగ్మతకు, హృద్రోగ సంబంధమైన సమస్యలు, కేన్సర్, రోడ్డు ప్రమాదాల్లో గాయపడటం, మానసిక అనారోగ్యం వంటి సమస్యలకు మధ్య సంబంధాలున్నాయని ఇప్పటికే పూర్తిస్థాయిలో రుజువైందన్నారు. జూదం, సైబర్ సంబంధమైన వ్యసనాలు, లైంగిక వ్యసనాలు, పోర్నోగ్రఫీ, ఆన్ లైన్ గేమ్స్ కు బానిసలవడం, వంటి రుగ్మతలకు చికిత్సపై మార్గదర్శక సూత్రాలను వారికి సూచించారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వినియోగంపై ఈ ఏడాది నివేదిక సూచిస్తున్నట్టు చెప్పారు.

గతంలో ఆర్థిక మాంధ్యం కారణంగా తలెత్తిన పర్యవసానాల వంటివే ఇప్పుడూ ఎదురయ్యే ఆస్కారం ఉందన్నారు. పేదలు, తమకు ఏ మాత్రం అవకాశాలు దక్కనివారు మత్తు మందులు, మాదక ద్రవ్యాల వ్యసనానికి, ఆ వ్యసనాల పర్యవసానాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. పొగతాగే వ్యసనం ఉన్నవ? వంటివే ఇప్పుడూ ఎదురయ్యే ఆస్కారం ఉందన్నారు. పేదలు, తమకు ఏ మాత్రం అవకాశాలు దక్కనివారు మత్తు మందులు, మాదక ద్రవ్యాల వ్యసనానికి, ఆ వ్యసనాల పర్యవసానాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. పొగతాగే వ్యసనం ఉన్నవారికి కొన్ని వ్యాధు లుసోకే అవకాశాలు ఎక్కువని,వాటికి దూరంగా ఉండాలని అయన వారికి సూచించారు. మద్యపాన వ్యసనానికి గురికావడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గిపోవడం జరుగుతుందని, ఇది మరింత నష్టదాయకమని, ఇతర మత్తు మందులు, మాదక ద్రవ్యాల వ్యసనం ఉన్నా ఇదే నష్టం జరుగుతుందని ఎస్ ఐ.జనార్ధనరావు వివరించారు. మత్తు మందులు, మాదక ద్రవ్యాల సమస్యపై ప్రపంచ ఆరోగ్య సంస్థ విధానాన్ని అమలు చేయడంలో తన అనుభవాలను గుర్తుకు తెచ్చుకున్నారు. మాదక ద్రవ్యాల వినియోగం కారణంగా తలెత్తే నష్టాలను, హానికరమైన పరిణామాలను నివారించేందుకు ఆరోగ్య నిపుణులకు, సహాయంగా కొన్ని ప్రమాణబద్ధమైన మార్గదర్శకాలు అవసరమని అయన అభిప్రాయపడ్డారు.మత్తు మందులు, మాదక ద్రవ్యాల వ్యసనాన్ని మాన్పించేందుకు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ రూపొందించిన ప్రమాణబద్ధమైన చికిత్సా మార్గదర్శక సూత్రాలను ప్రతి ఆసుపత్రి అనుసరించవచ్చన్నారు. "మద్యం, మత్తుమందుల దుర్వియోగ రుగ్మతల చికిత్సలో ఏర్పడిన అంతరాన్ని తగ్గించడానికి ఈ మార్గదర్శక సూత్రాలు దోహదపడతాయి. ఆరోగ్యవంతంగా, ఆనందదాయకంగా, సుసంపన్నంగా మనం ఎదగడానికి ఈ మార్గదర్శకాలు ఉపకరిస్తాయి" అని ఆయన వ్యాఖ్యానించారు. వ్యసనాలపై పోరాటంలో సమాజానికి, వైద్య లోకానికి మధ్య అవగాహన, సహకారం ఎంతో అవసరంగా సూచనలు చేశారు. మత్తు పదార్థాలు సేవించే వారు మహిళలపైఅత్యాచార, లైంగిక వేధింపుల జరిపేఅవకాశాలు.లేకపోలేదన్నారు. కేసుల్లో 14 రోజుల్లోనేవిచారణ పూర్తిచేసే విధంగా ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించిందన్నారు.